

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే గాదరి కిషోర్ వెంటనే మాదిగలకు క్షమాపణ చెప్పాలని మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. - 10లో



ఆదాయమున్నా సౌకర్యాలు సున్నా

సాగర్‌లో పర్యాటక అభివృద్ధి సంస్థకు ఆదాయమున్నా పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 44°/28°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు సురక్ష దినోత్సవం

సూర్యాపేట క్రైం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సురక్ష దినోత్సవ ర్యాలీకి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ కోరారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ర్యాలీ కొత్త బస్టాండ్ నుంచి పాత మార్కెట్ వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పౌరులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. అలాగే ఎస్వీ డిగ్రీ కళాశాల నుంచి వాహనాల ర్యాలీ ప్రారంభమై కొత్త బస్టాండ్ వద్దకు వస్తుందన్నారు. అక్కడి నుంచి ప్రజలతో కలిసి పాత మార్కెట్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో సభ ఉంటుందని, అనంతరం సహపంక్తి భోజనాలు ఉంటాయన్నారు.

హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి కాయకల్ప అవార్డు



మాట్లాడుతున్న డాక్టర్ కరుణ్‌కుమార్

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రి కాయకల్ప అవార్డుకు ఎంపికై నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరుణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ జాతీయ ఆరోగ్యమిషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అందజేసే కాయకల్ప అవార్డుకు ఆస్పత్రిని ఎంపిక చేసి ఈ–మెయిల్ ద్వారా సమాచారం పంపడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో పాటు ప్రోత్సాహకంగా రూ.లక్ష నగదు అందజేస్తారని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జాతీయ ఆరోగ్యమిషన్ బృందం ఆస్పత్రిలో వివిధ అంశాలను పర్యవేక్షించి 70 శాతం మార్కులు కేటాయించడంతో మొట్టమొదటిసారి కాయకల్ప అవార్డుకు ఎంపికైందన్నారు. బయో మెడికల్ వేస్టేజీ, పారిశుద్ధ్య నిర్వహణ, ఇన్ఫెక్షన్ సోకకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, రికార్డుల నమోదు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. ఈ అవార్డుకు ఎంపిక కావడానికి సమష్టిగా కృషి చేసిన వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో ఈ ఏడాది మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, మైనారిటీ విద్యార్థులు 2023–24వ విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం పొందుటకు ఈ నెల 11 వరకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.దయానందరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా సంబంధిత ధ్రువ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీల ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మట్టపల్లి సైదులు

చివ్వెంల: ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సైదులు యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పాండ్యానాయక్ తండాలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, ధర్మ, వెంకటి, తుల్జా, నీలా, లచ్చి, కూలీలు పాల్గొన్నారు.

తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సురేందర్

తుంగతుర్తి: తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనకల్ మండలం సోమ్లా తండాకు చెందిన గుగులోతు సురేందర్ నాయక్ శనివారం ఎన్నికయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీ రిజర్వుడ్ కావడంతో సురేందర్‌నాయక్‌ను ఎంపిక చేశారు. అలాగే మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా రావులపల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డి గోపాల్‌రెడ్డి, డైరెక్టర్లుగా గోపగాని శ్రీనివాస్, పులుసు వెంకటనారాయణ, తల్లపల్లి యాదగిరి, పద్మ, మహేష్, లింగారెడ్డి, తిరుమలరావు, తీగల వెంకన్న, గంగయ్య, బద్దం వెంకటరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రెండు రైల్వే లైన్లు!

ఇప్పటికే డోర్నకల్ – మిర్యాలగూడ లైన్‌కు కొనసాగుతున్న సర్వే

- తాజాగా శంషాబాద్ – వైజాగ్ లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్లనున్న హైస్పీడ్ రైల్వేలైన్
- రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్ర మంత్రుల ప్రకటన
- ఆనందం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు



కోదాడ: ఇప్పటి వరకు ప్యాసింజర్ రైలు ముఖం చూడని జిల్లా వాసులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. జిల్లా మీదుగా రెండు రైల్వే లైన్లు వేయాలని నిర్ణయం తీసుకుంది. దీంతో కొద్ది సంవత్సరాల్లోనే జిల్లా వాసులకు ఒక సాధారణ, మరో హైస్పీడ్ రైల్వేలైన్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే డోర్నకల్–మిర్యాలగూడ మార్గానికి సంబంధించి సర్వే దాదాపు పూర్తికావొచ్చింది. తాజాగా శుక్రవారం కేంద్ర రైల్వే, పర్యాటకశాఖ మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డిలు తెలుగు రాష్ట్రాల విభజన హామీల్లో భాగంగా శంషాబాద్ నుంచి వయా విజయవాడ మీదుగా వైజాగ్ వరకు హైస్పీడ్ రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీని సర్వే కోసం కాంట్రాక్టర్‌ను కూడా నియమించడంతో ఈ ప్రాజెక్టు వేగంగా పట్టాలెక్కే అవకాశముంది. కేంద్ర మంత్రుల తాజా ప్రకటనతో జిల్లా వాసులకు ఆనందాన్ని కలిగిస్తుంది.

తీరనున్న జిల్లా వాసుల చిరకాల వాంఛ

తమ పట్టణంలో రైలు ఎక్కాలనుకుంటున్న జిల్లా వాసుల చిరకాలకోరిక తీరే సమయం దగ్గరపడింది. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డి ప్రకటించిన ఈ కొత్త రైల్వేలైన్ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే జిల్లాలోని సూర్యాపేట, కోదాడ వాసులు హైస్పీడ్ రైలు ఎక్కడానికి ఎక్కువ సమయం పట్టదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగు రాష్ట్రాల విభజన హామీల్లో భాగంగా రెండు రాష్ట్రాలను కలుపుతూ శంషాబాద్ నుంచి వయా విజయవాడ మీదుగా వైజాగ్ వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం ప్రిలిమినరీ ఇంజనీరింగ్ అండ్ ట్రాఫిక్ (పెట్) సర్వేకు రైల్వేబోర్డు అనుమతులు మంజూరు చేసింది. దీనికి కాంట్రాక్టర్‌ను కూడా నియమించింది. ఆరు నెలల్లో సదరు కాంట్రాక్టర్ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. 220 కి.మీ. గరిష్ఠ వేగంతో (సెమీ హైస్పీడ్) రైళ్లను నడిపే విధంగా ఈ లైన్ వేయాలని నిర్ణయించారు. రైల్వే లైన్ అలైన్‌మెంట్ ప్రాథమికంగా శంషాబాద్ నుంచి అంబర్‌పేట ఓఆర్ఆర్ మీదుగా 65వ నంబర్ జాతీయ రహదారికి సమాంతరంగా ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. దీనివల్ల ఉమ్మడి జిల్లాలోని చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, సూర్యాపేట, కోదాడ పట్టణాల సమీపంలోనుంచి ఈ లైన్ వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

పూర్తికావొచ్చిన డోర్నకల్ – మిర్యాలగూడ లైన్ సర్వే

డోర్నకల్ నుంచి మిర్యాలగూడ వరకు నూతనంగా ఏర్పాటు చేయనున్న బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్ సర్వే పనులు గడిచిన ఆరు నెలలుగా జరుగుతున్నాయి. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో సర్వే పనులు ఇప్పటికే పూర్తి కాగా ప్రస్తుతం నల్లగొండ జిల్లా పరిధిలో సర్వే జరుగుతోంది. ఈ లైన్ డోర్నకల్, నేలకొండపల్లి, కోదాడ, హుజూర్‌నగర్‌ల మీదుగా మిర్యాలగూడకు చేరుకోనుంది. మరో ప్రతిపాదనలో డోర్నకల్, నేలకొండపల్లి, కోదాడ, హుజూర్‌నగర్ మీదుగా ఇప్పటికే ఉన్న జాన్‌పహాడ్ వద్ద లైన్‌కు కలిసే విధంగా తయారు చేస్తున్నట్లు సమాచారం. దీనిలో మొదటి ప్రతిపాదనకే అధికారులు మొగ్గుచూపుతున్నారని.., వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఈ లైన్‌కు నిధులు మంజూరు చేయించడానికి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ విషయంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడకు చెందిన ఐఆర్‌టీఎస్ అధికారి బర్మావత్ నాగ్యానాయక్ తీవ్ర కృషి చేస్తున్నట్లు తెలిసింది.

ఎంపీ కాగానే పార్లమెంట్‌లో ప్రతిపాదించా..



హైదరాబాద్ – విజయవాడల మధ్య హైస్పీడ్ రైల్వేలైన్ ఆవశ్యకతను నేను ఎంపీగా ఎన్నిక కాగానే తొలిసారి పార్లమెంట్‌లో ప్రతిపాదించాను. రెండు రాష్ట్రాల మధ్య ఈ లైన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పాను. ప్రభుత్వం దీనిపై ఇన్నాళ్లకు నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. దీనికి వెంటనే నిధులు మంజూరు చేయించడానికి నావంతు ప్రయత్నం చేస్తాను.

– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ నల్లగొండ

సాగు ప్రణాళికేదీ?

- రోహిణి కార్తె కావడంతో మొదలైన వానాకాలం సాగు పనులు
- తొలకరి నాటికి భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- ఇంతవరకు ప్రణాళిక ఖరారు చేయని వ్యవసాయ శాఖ



పత్తి కట్టెను తొలగించి తగులబెడుతున్న రైతు

భానుపురి (సూర్యాపేట): జిల్లా రైతాంగం 2023 వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతోంది. రోహిణి కార్తె ప్రవేశించడంతో రైతులు వ్యవసాయ భూములను సిద్ధం చేస్తున్నారు. వివిధ పంటల సాగు కోసం కావాల్సిన పనులను ఒక్కొక్కటిగా చేసుకుంటున్నారు. అయితే జిల్లా వ్యవసాయ శాఖ మాత్రం రానున్న వానాకాలం పంటల సాగు అంచనాను నేటికీ విడుదల చేయలేదు. ఏ పంటలు.. ఎంత విస్తీర్ణంలో సాగవుతాయో... ఎంత మేరకు విత్తనాలు, ఎరువులు అవసరమవుతాయన్న అంచనాలే లేకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం పంట కాలాన్ని ముందుకు జరపాలని, ఇందుకోసం రైతులను సమాయత్తం చేయాలని పిలుపునిస్తుండగా జిల్లా వ్యవసాయ శాఖ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధిక దిగుబడి కోసం..

రోహిణి కార్తెలో వ్యవసాయ పనులు ప్రారంభించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఏర్పాట్లను ఈ కార్తెలోనే చేసుకుంటారు. ఈ క్రమంలో జిల్లాలో పత్తి సాగు చేసే రైతులు వేసవి దుక్కులు దున్నడం, గతేడాది పంట వ్యర్థాల తొలగింపు ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నారు. ప్రధానంగా బోరుబావుల కింద, మెట్ట పంటలు సాగు చేసే రైతాంగం తొలకరి వర్షాల నాటికి తమ భూములను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. అదేవిధంగా భూములను సారవంతంగా మార్చుకునేందుకు పశువుల ఎరువును తమ భూముల్లోకి తోలుకుంటున్నారు. ఈ కార్తెలో నార్లు పోసుకుంటే పంటలకు చీడపీడలు తక్కువగా ఆశిస్తాయని.. తద్వారా పంటల దిగుబడి అధికంగా వస్తుందన్న నమ్మకంతో సాగు పనులు ముమ్మరం చేశారు.

పూర్తికాని సాగు అంచనా..

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో దాదాపు ఈ యాసంగి పంటల కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇక తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో చాలాచోట్ల పూర్తవ్వగా.. అక్కడక్కడా చివరి దశలో ఉన్నాయి. ప్రతి ఏటా ఈ సమయానికే జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా రైతాంగం సాగు చేసే పంటలు అవసరమైన విత్తనాలు ఎరువులకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తుంది. ఈ నివేదికల ప్రకారం జిల్లాకు సరిపడా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. అయితే మరో 10, 15 రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు వానాకాలం పంటలకు సిద్ధమవుతున్నా.. సాగు అంచనా మాత్రం పూర్తికాలేదు.

వైభవంగా నారసింహుడి స్వాతినక్షత్ర కల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వాతినక్షత్ర కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, అర్చనలు చేపట్టారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపించారు. స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడవాహనంపై ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు తెల్లవారుజాముననే కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, చెన్నూరు మట్టపల్లి రావు, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రైతు బాంధవుడు.. కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ వెంకట్రావు, ప్రజాప్రతినిధులు

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాకే పండుగలా వ్యవసాయం
- రైతు దినోత్సవంలో మంత్రి జగదీష్‌రెడ్డి



రైతులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని, రైతులను పట్టించుకున్న నాయకులు లేరని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో రైతు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతుల కష్టాలు తీర్చిన రైతు బాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని ఎండ్లపల్లి గ్రామంలో రైతు వేదికలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూసీ ఆయకట్టు రామారం, సోలీపేట, రామచంద్రాపురం, రత్నపురం, హనుమనాయక్ తండా గ్రామాలకు చెందిన రైతాంగం భారీ ఎత్తున తరలి వచ్చింది. అనంతరం ఎండ్లపల్లి గ్రామంలో ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శనతో పాటు కోలాటం, భజన బృందాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మంత్రి జగదీష్‌రెడ్డి స్వయంగా ఎడ్లబండి తోలుకుంటూ రైతు వేదిక వద్దకు చేరుకొని రైతు దినోత్సవంలో పాల్గొన్నారు. మంత్రి ఎడ్లబండి తోలడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దండగ అనుకున్న వ్యవసాయం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే పండుగలా మారిందని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలే దోహదపడ్డాయని కొనియాడారు. విద్యుత్ రంగంలో సాధించిన విజయాలు యావత్ భారతదేశంలో పెనుదుమారం సృష్టిస్తున్నాయన్నారు. ఉండనే ఉండదు అనుకున్న విద్యుత్ పోనే పోదు అన్న కాడికి తీసుకువచ్చిన దార్శనికుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, జిల్లా నార్ముల్ డైయిరి డైరెక్టర్ చల్లా సురేందర్‌రెడ్డి, సర్పంచ్ దండి సుగుణమ్మ, ఎంపీటీసీ సరిత, కక్కిరేణి నాగయ్యగౌడ్, రైతుబంధు సభ్యురాలు మాలి కవిత, ఉయ్యాల రవి, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతు దినోత్సవానికి హాజరైన వివిధ గ్రామాల రైతులు, మహిళలు

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట రూరల్: జిల్లాలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం బాలెంల రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు దినోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వరిసాగు గణనీయంగా పెరిగిందని, రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందిస్తోందన్నారు. యువ రైతులను కూడా ప్రోత్సహిస్తున్నామని, అలాగే రైతు వేదికల ద్వారా పంట సాగు విధానంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, తహసీల్దార్ వెంకన్న పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు భూముల వివరాలివ్వండి

జిల్లా కేంద్రంలో ఆటోనగర్ ఏర్పాటు కోసం అనుకూలమైన ప్రభుత్వ భూముల వివరాలు ఇవ్వాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం చివ్వెంల మండలం గ్రామ రెవెన్యూ శివారు పరిధిలోని ఇమాంపేటలో ఉన్న సర్వే నంబర్ 146లో గల ప్రభుత్వ భూములను అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, టీఎంఐఐసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటుకు నీటి వనరులు, భూముల అనుకూలత విషయాలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నామని పేర్కొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



కందిబండలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో పాల్గొన్న డీఈఓ అశోక్ తదితరులు

మేళ్లచెరువు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు బడి బయట ఉన్న బడి ఈడు పిల్ల లను బడుల్లో చేర్పించాలని డీఈఓ కె.అశోక్ అన్నారు. మేళ్లచెరువు మండలంలోని కందిబండ గ్రామంలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 17 వరకు జరిగే బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మన ఊరు–మన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను అందిరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్‌రావు, సర్పంచ్ అబ్రహం, రుక్కయ్య, నాగిరెడ్డి, రాఘవరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు ఆదరణ

- పన్నెండు వారాలుగా 3,800 మంది మహిళలకు వైద్య పరీక్షలు
- నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం సేవలు
- ఉచితంగా మందులు అందిస్తున్న ప్రభుత్వం



త్రిపురారంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

తిరుమలగిరి (తుంగతుర్తి): మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. మహిళలకు సంక్రమించే వివిధ రకాల వ్యాధులకు వైద్యం అందించి నయం చేయాలనే ఉద్దేశంతో ఆరోగ్య మహిళ పేరుతో ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు 12 మంగళవారాల్లో 3,800 మందికి పరీక్షలు చేశారు. ఇందులో సమస్యాత్మక కేసులను గుర్తించి వారిని మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు పంపిస్తున్నారు.

ఇవీ వైద్య పరీక్షలు

ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో పేరు నమోదు చేయించుకున్న వారికి 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో డయాగ్నసిస్, సూక్ష్మ పోషక లోపాలు, కుటుంబ నియంత్రణ, రుతుస్రావ సమస్య నివారణ, లైంగిక వ్యాధులు, క్యాన్సర్ స్క్రీనింగ్, మూత్రనాళాల ఇన్‌ఫెక్షన్, మోనోఫాస్, శరీర బరువు, ఎముకల బలహీనత లాంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందిస్తున్నారు. జిల్లాలో ఎముకల బలహీనత, క్యాన్సర్, బెస్ట్ క్యాన్సర్ లాంటి సమస్యలు తేలడంతో ముందస్తుగా గుర్తించి వైద్య పరీక్షలు చేశారు.


మహిళా దినోత్సవం సందర్భంగా

ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో త్రిపురారం, పెన్‌పహాడ్, నేరేడుచర్ల, నూతనకల్‌తో కలిపి మొత్తం నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా ప్రతి మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఇద్దరు వైద్యులు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు మరికొందరు సహాయకులు సేవలు అందిస్తున్నారు. రోజువారి రోగులతో పాటు ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమానికి ఆయా ఆరోగ్య కేంద్రాలకు మహిళలు భారీగా తరలి వస్తున్నారు. ముఖ్యంగా పేద మహిళలు వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకెళుతున్నారు.

ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలు నమోదు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే మహిళల సమగ్ర వివరాలను వైద్యసిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇక్కడ వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు అందజేయడంతో పాటు మెరుగైన వైద్య సేవల కోసం వైద్యులు కృషి చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం ఆరోగ్య మహిళ పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ఒక్క మహిళ ఈ కార్యక్రమం కింద వైద్య పరీక్షలు చేయించుకుంటే ఏదేని తెలియని వ్యాధి ఉంటే నయం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం చేసుకుంటే సకాలంలో నివారించవచ్చు.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి సూర్యాపేట

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

తిరుమలగిరి (తుంగతుర్తి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. తిరుమలగిరి, గుర్రంపోడు, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా పెద్దవంగర మండలం కొడిపల్లి గ్రామానికి చెందిన తేలుకుంట్ల స్వరూప (25)భర్త నరేష్ పిల్లలతో కలిసి తిరుమలగిరి నుంచి తొర్రూరు రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో తొండ గ్రామ శివారులో లారీ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టడంతో స్వరూప అక్కడికక్కడే మృతిచెందగా నరేష్, ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి..

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలుకు చెందిన కొంగర లక్ష్మయ్య(39) శనివారం బైక్‌పై ఆరేగూడెం స్టేజి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు గ్రామంలో వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ఆటో బోల్తా పడి..

నార్కట్‌పల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం వెల్లి గ్రామానికి చెందిన మరెడ్డి రాజేష్ (22), గోగుల సాయిరామ్ (22) నర్సరీ మొక్కల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా ట్రాలీ ఆటోలో ఐరన్ సెంట్రింగ్ లోడ్‌తో శనివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆటో వెనుక టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజేష్, సాయిరామ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

వడదెబ్బతో ఒకరు మృతి

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బతో ఒక వ్యక్తి మృతి చెందాడు. మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన ఉబ్బపల్లి మహేష్(40) భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.

ఆదాయమున్నా సౌకర్యాలు సున్నా

- సాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువు
- లాంచీల కోసం వేచి చూసే దగ్గర ఏర్పాటు చేయని స్టేషన్
- వాష్‌రూమ్స్ లేకపోవడంతో అవస్థలు
- విజయవిహార్ ప్రాంగణంలో కోతులు, పందుల సంచారం


పాత లాంచీస్టేషన్ సమీపంలో వృథాగా ఉన్న మొబైల్ వాషింగ్ రూమ్ వాహనం


లాంచీస్టేషన్, హోటల్ నిర్మాణం చేసే స్థలం

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థకు ఆదాయం ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. హోటల్, అతిథి గృహం గదుల అద్దెలే టీఎస్‌టీడీసీకి నెలకు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల మేర ఆదాయం వస్తుంది. లాంచీలతో వచ్చే ఆదాయం అదనంగా ఉంటుంది. గతంలో 24గంటల పాటు ఉండే సెక్యూరిటీని కూడా ప్రస్తుతం తొలగించారు. సాగర్‌లో బుద్ధవనంను మినహాయిస్తే ఎక్కడా రూపాయి ఖర్చు లేదు. అయినా ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదని విమర్శలున్నాయి. పర్యాటకులు లాంచీల కోసం వేచి చూసే దగ్గర లాంచీ స్టేషన్ నిర్మాణం చేయలేదు. దీంతో పర్యాటకులు ఎండలోనే కిలోమీటరు దూరం నడిచి అక్కడ జలాశయతీరంలో వేచిచూడాల్సి వస్తుంది. అక్కడ కనీసం వాష్‌రూములు ఏర్పాటు చేయకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. అంతేకాకుండా విజయవిహార్ ప్రాంగణంలో కోతులతో పాటు పందులు స్వైరవిహారం చేస్తుంటాయి.

హోటల్ ఏర్పాటుకు నదీతీరంలో స్థలం..

పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పాత లాంచీస్టేషన్ దగ్గర ఉన్న వాషింగ్ మొబైల్ వాహనాన్ని నదీతీరం వద్ద పెట్టాలని కోరుతున్నారు. నదీతీరంలో ఉన్న లాంచీ స్టేషన్ వద్ద పర్యాటకులకు ఆహారపదార్థాలు అందుబాటులో ఉంచేందుకు హోటల్ ఏర్పాటు చేసేందుకు స్థలం ఉంది. అక్కడ హోటల్ ఏర్పాటు చేస్తే పర్యాటకులు లాంచీలు వచ్చేంతవరకు అందులో సేదతీరేందుకు అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అదేవిధంగా టికెట్స్ ఇచ్చేందుకు బుకింగ్ కౌంటర్, వాషింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని చెబుతున్నారు.

> **సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా**
>
> నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు నెలకొంటున్న సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా. సమస్యలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేవిధంగా వారికి విన్నవిస్తాం.
>
> – సైదులు, లాంచీమేనేజర్

క్యాన్సర్‌కు మనోధైర్యమే మందు

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: క్యాన్సర్‌కు మనోధైర్యమే మందు అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కేన్సర్‌తో బాధపడుతూ సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సంక్రమిత వ్యాధుల విభాగం పాలియేటివ్ కేర్‌లో చికిత్స పొందుతున్న ధరావత్ స్వాతి కోరిక మేరకు శనివారం మంత్రిని తీసుకొచ్చి ఆమెకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబానికి ఆయన మనోధైర్యం అందించారు. వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో వైద్య సౌకర్యాలు కార్పొరేట్ స్థాయికి వచ్చాయని, తెలంగాణ ఏర్పడ్డాక వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఎంతో బిజీగా ఉన్నా క్యాన్సర్ బాధితురాలి కోరిక మేరకు ఆమెను కలిసి ఓదార్చినందుకు మంత్రికి వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలియేటివ్ కేర్ వైద్యాధికారి డాక్టర్ షష, ఫిజియో థెరపిస్టు శ్వేత, త్రివేణి, వాణి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.


క్యాన్సర్ బాధితురాలు స్వాతి కుటుంబ సభ్యులతో మంత్రి జగదీశ్‌రెడ్డి

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

- నల్లగొండ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నకిరేకల్ : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వ్యవసాయ పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవాల్లో భాగంగా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు వేదిక భవనాన్ని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ప్రారంభించారు. తొలుత చందుపట్ల గ్రామస్తులు ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్లు, మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతు వేదిక భవనంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ అవతరణ దినోత్సవాల్లో భాగంగా గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు అంతకు ముందు ఉన్న పరిస్థితులను పరిశీలన చేసుకోవాలని చెప్పారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రైతులకు పెట్టుబడుల కోసం గతంలో అప్పులు తెచ్చి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునేవారని, నేడు ఆ పరిస్థితి లేకుండా రైతుబంధు ప్రవేశపెట్టి వారికి సహాయం అందించడం గొప్పవిషయమని తెలిపారు.

యాదాద్రిలో మంత్రి, అధికారుల పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్‌లకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

బావను హత్య చేసిన బావమరిది

- సుత్తెతో తలపై మోది ఘాతుకం
- భూమి ఇవ్వడం ఇష్టం లేకనే దారుణం
- పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఘటన

పెద్దఅడిశర్లపల్లి : బావమరిది చేతిలో బావ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం మొసంగి గ్రామానికి చెందిన మిడసనమెట్ల సాయన్న తన కూతురు పారిజాతను నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మారడుగుల గ్రామానికి చెందిన చౌట ఆంజనేయులుకి (35)ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో తనకున్న రెండు ఎకరాల్లో కూతురికి ఎకరం భూమి ఇచ్చాడు. అంజనేయులు తన భార్య పారిజాతతో కలిసి హైదరాబాద్‌లో పేయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కొడుకు వెంకటయ్య తాగి వ్యసనాలకు అలవాటు పడుతున్నాడని ఉన్న ఇంకో ఎకరం భూమి సాయన్న తన పేరిట ఉంచుకున్నాడు. ట్రాక్టర్ నడుపుకుంటూ పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఉంటున్న సాయన్న కుమారుడు వెంకటయ్య తన చెల్లెలికి భూమి ఇవ్వడం ఇష్టంలేక బావపై కక్ష పెంచుకున్నాడు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

నాలుగు రోజుల క్రితం పిలిపించుకుని..


ఆంజనేయులు (ఫైల్)

వెంకటయ్య నాలుగు రోజుల క్రితం ఆంజనేయులును అంగడిపేటకు రప్పించుకున్నాడు. ఫూటుగా మద్యం తాపించి శుక్రవారం సుత్తెతో మోది అంజనేయులును దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఆంజనేయులు మృతదేహాన్ని బస్తాలో కట్టి శుక్రవారం రాత్రి అంగడిపేట సమీపంలోని ఏఎమ్మార్పీ కాలువ పక్కన వేశాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దారుణం వెలుగులోకి వచ్చింది. దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కొండమల్లేపల్లి సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. అంజనేయులు భార్య పారిజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ


ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న పీసీబీ జిల్లా ఈఈ సురేష్, దివీస్ డైరెక్టర్ దివిరావు

చౌటుప్పల్: ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, ప్రజలు తమవంతుగా సహకరించాలని పీసీబీ జిల్లా ఈఈ సురేష్, దివీస్ డైరెక్టర్ దివిరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం అంకిరెడ్డిగూడెంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా వారు స్థానిక సర్పంచ్ ముద్దం సుమిత్రసత్తయ్యతో కలిసి రహదారుల వెంట ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. తడి, పొడి చెత్త సేకరణ కోసం డ్రమ్ములను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజర్‌లు పెంద్యాల సుధాకర్, బాలకిషోర్, సాంబశివరావు, రాఘవేందర్‌రావు, సీనియర్ మేనేజర్లు శివప్రసాద్, నర్సయ్య, సీఎస్సార్ ఇన్‌చార్జ్ వల్లూరి వెంకటరాజు తదితరులున్నారు.

మాదిగలకు ఎమ్మెల్యే కిషోర్ క్షమాపణ చెప్పాలి


అఖిలపక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న మంద కృష్ణమాదిగ, వివిధ పార్టీల నాయకులు

- మా కన్నును మా వేలితోనే పొడిపిస్తున్నాడు
- 9 మండలాల్లో మాదిగలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తిరుమలగిరి(తుంగతుర్తి): తుంగతుర్తి నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు జరుగుతున్నాయని, ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎమ్మెల్యే కిషోర్ మాదిగలపైనే దాడులు జరుపుతున్నాడన్నారు. గత నెల 19న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, తన తప్పును ఒప్పుకొని మాదిగలకు, ఇతర పార్టీల నాయకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమలగిరిలో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో మంద కృష్ణమాదిగ మాట్లాడారు. ఎమ్మెల్యే కిషోర్ ఎమ్మార్పీఎస్ నా కొడుకులు అనడంతో మాదిగలు, ఉప కులాల ప్రజల హృదయాలు గాయపడ్డాయన్నారు. కిషోర్‌ను మాదిగలకు శత్రువుగానే పరిగణిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎమ్మెల్యే కిషోర్‌చే క్షమాపణ చెప్పిస్తాడో, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ నిరాకరిస్తాడో తేల్చుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రే దళిత బంధులో అవినీతి చోటు చేసుకుందని చెప్పారని గుర్తుచేశారు. దళిత బంధులో అవినీతికి పాల్పడిన వారి లిస్టు బయట పెట్టాలన్నారు. గతంలో కూడా మాదిగ బిడ్డలైన పాల్వాయి నగేష్, మల్లెపాక సాయిబాబా, అడ్వకేట్ యుగేందర్‌లపై భౌతిక దాడులు చేయించాడని ఆరోపించారు. వీరిపై కూడా మాదిగలతోనే దాడులు చేయిస్తున్నాడని, మా కన్నును మా వేలితోనే పొడిపిస్తున్నాడని విమర్శించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గ ఉప కులాల ప్రజలు 80 శాతం ఉన్నారని, అన్ని పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకే టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులతో మాట్లాడి మాదిగలకు టిక్కెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. కేసీఆర్ మంత్రి వర్గంలో ఒక్క మాదిగ మంత్రి కూడా లేడని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగలే ఎక్కువగా చనిపోయారని తెలిపారు. నియోజకవర్గంలోని 9 మండలాల్లో మాదిగలతో త్వరలో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, ధీన్‌దయాళ్, కందుకూరి శ్రీను, అబ్బాస్, శ్రీనునాయక్, బోడ సునీల్, సైదులు, సాయిబాబా, వీరేష్, రాంబాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

మేళ్లచెరువు : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని రేవూరులో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరు గ్రామానికి చెందిన నాగరాణి(23) అదే గ్రామానికి చెందిన జూనే బోయిన లక్ష్మణ్‌తో ఆరు సంత్సరాల క్రితం వివాహం జరిగింది. కాగా ఇరువురు తరచూ కట్నం కోసం గొడవపడుతూ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. ఈ నెల 1వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో భర్త లక్ష్మణ్ అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో నాగరాణి అన్న వెంకట శ్రీను అక్కడకు వెళ్లి చెల్లిని పుట్టింటికి తీసుకుపోయాడు. రెండవ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో నాగరాణి తిరిగి భర్త ఇంటికి తిరిగి వచ్చింది. మళ్లీ భర్త వేధించడంతో అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, శ్రీను చెల్లి యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఇంటికి రాగా అప్పటికే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.


నల్లగొండ జైలుకు రైతుల తరలింపు

భువనగిరిటౌన్ : భద్రతా కారణాల దృష్ట్యా నలుగురు రైతులను శనివారం భువనగిరి సబ్ జైలు నుంచి నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు. గత నెల 29వ తేదీన కలెక్టరేట్ వద్ద రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని రైతులు 48 గంటల పాటు ఆందోళన చేపట్టారు. దీంతో రైతులు యాదగిరి, బాలనర్సింహ, మల్లేష్‌గౌడ్, నిఖిల్‌ను నాన్‌బెయిల్‌బుల్ కేసు పెట్టి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. రైతులను పరామర్శించేందుకు భువనగిరి సబ్‌జైలుకు వివిధ పార్టీల నాయకులు, రైతులు, పెద్ద ఎత్తున్న వస్తున్న నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు.

దేశానికి అన్నం పెడుతున్న తెలంగాణ

- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి

భువనగిరిటౌన్: వరి ధాన్యంలో తెలంగాణ అధిక దిగుబడి సాధించి దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని బొల్లేపల్లి రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, ఇతర రంగాల ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీని అధికారంలో తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బూరు బీరుమల్లయ్య, మండల కన్వీనర్ కంచి మల్లయ్య, సర్పంచ్ మద్ది బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా రాయగిరి రైతు వేదికలో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత వ్యవసాయ రంగం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. న్యాయ సేవాధికారిత సంస్థ కార్యదర్శి మురళీమోహన్ మాట్లాడుతూ ఇకపై రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు పడుతున్నా తనకు దరఖాస్తు చేసుకుంటే వారికి న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ రావు, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మందికి గాయాలు

నాగార్జునసాగర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. నాగార్జునసాగర్, వేములపల్లి, మోటకొండూర్, నూతనకల్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్లనుంచి హాలియాకు వెళుతున్న ట్రాలీ ఆటో హిల్‌కాలనీలోని విజయవిహార్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సపావట్ దీప్లానాయక్(40)బైకు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ప్రమాదంలో దీప్లాకు గాయాలయ్యాయి. పోలీసులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. దీప్లా భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

లారీని ఢీకొని..

వేములపల్లి : చిల్వెలం మండలం రాజ్యానాయక్ తండాకు చెందిన నరేష్ వేములపల్లి నుంచి మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అటు వైపే వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే సాయం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సాయం చేశారు. వేములపల్లి మండల కేంద్రంలో రైతు దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మిర్యాలగూడకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గుర్తించి కారు దిగి క్షతగాత్రుడు నరేష్‌ను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నరేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు.

కారు ఢీకొని..

మోటకొండూర్: మండలంలోని ముత్తిరెడ్డిగూడెం–కొండాపూర్ గ్రామాల మధ్య శనివారం సాయంత్రం నిలిచున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ప్రశాంత్, వెంకటయ్య మోత్కూర్–రాయిగిరి రోడ్డు పక్కన తమ ద్విచక్రవాహనాన్ని నిలిపారు. కాగా ఆత్మకూరు(ఎం) వ్యవసాయ అధికారిని శిల్ప తన కారులో ఆత్మకూర్(ఎం) నుంచి భువనగిరి వైపునకు వస్తుండగా ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్‌ను కారు ఢీకొని..

నూతనకల్: ట్రాక్టర్‌ను కారు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రైతు తన వ్యవసాయ భూమిలో పనుల నిమిత్తం ట్రాక్టర్‌లో కూలీలను తీసుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రపహాడ్ గ్రామ శివారులో వ్యవసాయ పొలంలోకి ట్రాక్టర్‌ను మలుపుతుండగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.